# ఉదయించిన సూరీడు

-యల్లాప్రగడ సువర్చలాదేవి

"ఒరే ... సూర్య... టీసిఎస్‌లో వాక్ ఇన్ పడిందిరా....

"అవును...?! ఫ్రెషర్స్‌కి ఎలిజిబిలిటీ ఉందా?"

"ఈసారి పిలిచిందే ఫ్రెషర్స్‌ని... రేపు రాబోయే శనివారమే టెస్ట్"

"ఏంటి... రిటర్న్ టెస్టా?" సూర్యం గొంతులో చిన్నపాటి నిరుత్సాహం.

"మరి... రండి మాష్టారూ అంటూ పిలిచి అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికిస్తారా..." కాస్త వెటకారంగా అన్నాడు వెంకట్.

చిన్నబుచ్చుకొన్నట్లున్న సూర్యం మొహం చూసి కొంచెం నవ్వొచ్చినా, "ముందు రిటన్ టెస్ట్, ఆ తర్వాత గ్రూప్ డిస్కషన్ దాని తర్వాత కొన్ని ఇంటర్వ్యూలు ఉంటాయి" అన్నాడు కాస్త శాంతంగా.

దాదాపు ఎన్ని కంపెనీలకు తిరిగాడో, ఎన్ని టెస్ట్‌లు రాశాడో, ఎన్ని ఇంటర్వ్యూలకి అటెండయ్యాడో అతనికే గుర్తు లేదు. కానీ తప్పదు. ఈ సారైనా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకొన్నాడు.

★★★

"చూడండి పరమేశ్వరరావుగారు! మీ మంచితనం వలన, మీ పెద్దవాళ్ల గొప్పదనం వలన ఇంకా ఇది పల్లెటూరే కాబట్టి మీకు గడచిపోతోంది కానీ, ఇలాగే ఇంకొన్నాళ్లు జరిగితే కష్టమండి" ఎంతో మర్యాదగా చెప్పాడు కిరాణాకొట్టు అప్పారావు.

"మీరేమి కంగారు పడకండి. మా వాడికి ఈసారి ఉద్యోగం వచ్చేస్తుంది. మొన్ననే ఓ ఇంటర్వ్యూకెళ్లాడు. దాదాపు అయిపోయినట్లే'' చాలా నమ్మకంగా చెప్పారు పరమేశ్వరరావుగారు.

"మీరు దాదాపు సంవత్సరం పైగా ఇలానే అంటున్నారు. కానీ మీ అబ్బాయికి ఉద్యోగం రాలేదు'' ఉండబట్టలేక బయటకే అనేశాడు అప్పారావు.

"ఈసారి అలా కాదు అప్పారావ్! మొన్నే ఫోన్ చేసి చాలా నమ్మకంగా చెప్పాడు మా వాడు. వస్తాను'' అనేసి హడావిడిగా వెళ్లిపోయాడాయన.

★★★

"నేనన్నానని కాదుగానీ బావా! నువ్వేన్నైనా చెప్పు, మనవాడు మన దగ్గర ఉంటేనే మంచిది. అయినా మన ఊర్లో వాడికేం తక్కువని. సొంత ఇల్లు, పాడి, పొలం, మనవాళ్లమందరం ఉన్నాం. హాయిగా ఇక్కడుండి అన్నీ చూసుకుంటూ అందరితో కలసి ఉండక అక్కడ ఎంతకాలమని పాట్లు పడతాడు'' పరమేశ్వరరావు బావ గోవిందరావు చెప్పుకుపోతున్నాడు.

బావ మాటలకు అడ్డొస్తూ తీవ్ర స్వరంతోనే అన్నాడు పరమేశ్వరరావు.

"అయినా వాడిని ఇంత చదివించింది ఈ ఊర్లో మట్టి పిసుక్కుంటూ కూర్చోవడానికా? వాడి స్నేహితులందరూ పెద్ద ఉద్యోగాల్లో చేరి కార్లు, బంగళాలు కొనుక్కొని విమానాల్లో విదేశాలకి తిరుగుతుంటే వాడికి ఈ పల్లెటూళ్లో బతకాల్సిన ఖర్మేంటి? ఉద్యోగాలన్నాక అంత త్వరగా ఎక్కడొస్తాయి అందరికీ! కొంచెం టైం పడుతుందిలే!''

మరి మాట్లాడలేకపోయాడు గోవిందరావు.

★★★

"ఏంట్రా? ఫ్రెషర్స్ మాత్రమే అన్నావు. ఇంత మంది వచ్చారేమిటి?'' నీరుగారిపోతూ అన్నాడు సూర్యం.

"ఫ్రెషర్స్ కాబట్టే లైను ఇంత ఉంది. అదే అందరినీ అయితే లైను ఎన్ని కిలోమీటర్లు ఉంటుందో! అక్కడేదో గోలలాగా ఉంది చూద్దాం పదా'' అంటూ అటు దారితీశారు.

ముందుగా అనుకొన్నదాని కన్నా చాలా ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు వచ్చారు. కనుక కేవలం కొద్దిమందిని మాత్రమే పరీక్షకు అనుమతిస్తున్నట్లు, వారి వివరాలను అక్కడ నోటీసుబోర్డులో పెట్టడం, ఆ గోల యొక్క సారాంశం.

ఓ అరగంట 'యుద్ధం' తరువాత ఆ నోటీసు బోర్డులో 'తమ పేర్లు లేవు' అనే కబురు మోసుకుంటూ ఈసురోమని బయటపడ్డాడు వెంకట్.

"మన పేర్లు లేకపోవడమే మంచిదయ్యిందిలే'' కాస్త కచ్చిగానే అన్నాడు సూర్యం.

"అదేంటి అలా అంటావు'' ఈసారి ఆశ్చర్యపోవడం వెంకట్ వంతైంది.

"లేకపోతే ఇన్నివేల మందిలో మనం సెలెక్ట్ ఎలా అవుతామనుకొన్నావు? కనీసం ఎటెమ్ట్ కూడా చేయలేదు కాబట్టి రేపొద్దునెప్పుడైనా కనీసం మన అభ్యర్థిత్వాన్ని కన్సిడర్ అయినా చేస్తారు. గుడ్డిలో మెల్ల.''

సూర్యాన్ని ఏమనాలో, అతడు చెప్పింది కరెక్టో కాదో కూడా వెంకట్ బుర్రకి ఎక్కలేదు.

★★★

"చాలా ఫ్రస్టేషన్ వస్తోంది రమ్యా! ఎన్ని ఇంటర్వ్యూలు? నాకు విసుగొచ్చేస్తోంది. ఏం చేయాలో కూడా అర్థం కావటం లేదు'' ఆవేదనగా అన్నాడు సూర్యం.

"రేపు రాబోయే సోమవారం నాకు ఇంటర్వ్యూ ఉంది'' నెమ్మదిగా అంది రమ్య.

"నిజంగా?! కంగ్రాట్యులేషన్స్'' వివరాలేవో అడగాలనిపించలేదు సూర్యానికి.

"డోంట్ వర్రీ. కొన్నిసార్లు అంతే బ్యాడ్ టైమ్'' ఓదార్పుగా అంది.


రమ్య, సూర్యం ఎం.సి.ఏ. క్లాస్‌మేట్స్. అందమైన అమ్మాయి, మంచి అబ్బాయి స్నేహం చేస్తే ఏమవుతుందో అదే అయ్యింది. ఒకళ్లనొకళ్లు ఇష్టపడ్డారు. ఇద్దరికీ కాకపోయినా కనీసం సూర్యానికి ఉద్యోగం వచ్చినా పెళ్లి చేసుకోవాలనుకొన్నారు. రమ్య హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగింది. వాళ్ల నాన్నగారు బి.హెచ్.ఇ.ఎల్.లో పనిచేస్తున్నారు. అంతో ఇంతో ఉన్నవాళ్లే. రమ్య చదువు కాగానే మం సంబంధంచూసి పెళ్లి చేయాలనుకున్నారు.

కానీ రమ్య మాత్రం సూర్యం సెటిలయ్యే దాకా ఏదో ఒక వంకతో పెళ్లిని వాయిదా వేయాలని చూస్తుంది.

***

సూర్యం రూమ్‌కొచ్చి చూసేసరికి రూమ్‌కి తాళం వేసి ఉంది. ఎక్కడ తిరుగుతున్నాడో ఈ వెంకట్ గాడు అనుకుంటూ తలుపు తీసి లోపలికి వెళ్లిన సూర్యానికి అలమరాలో మడిచి పెట్టి ఉన్న కాగితం గాలికి రెపరెపలాడుతూ కనిపించింది.

"సూర్యం, ఇందాకే మా అన్నయ్య వచ్చాడురా. తన క్లోజ్ ఫ్రెండ్ పెళ్లి అని ఉదయాన్నే వచ్చాడుట. వాళ్ల కొలీగ్స్ అంతా కలిసి సుమోలో వచ్చారు. మళ్లీ రాత్రికే తిరిగి బెంగుళూరు వెళుతున్నారుట. కొంతకాలం అక్కడ ట్రై చేద్దువుగానీ మాతో వచ్చేయ్ అంటే, ఇక సరే అనుకొని వెళ్తున్నాను.



మిగతా విషయాలు తర్వాత మాట్లాడుకొందాం. మా అన్నయ్య సెల్ నెంబరు క్రింద ఇస్తున్నాను. వీలున్నప్పుడు ఫోన్ చేయి. నా దగ్గరున్న రెండో తాళం చెవిని ఇక్కడే వదిలి వెళ్తున్నాను. ఆల్ ది బెస్ట్" వెంకట్.

ఒక్కసారిగా నిస్సత్తువగా అనిపించింది సూర్యానికి. ఏదో ఒక శక్తి కోల్పోయినవాడిలా అయిపోయాడు. లెటర్ లోని నెంబర్‌ని కూడా చదవలేదు. లెటర్‌ని ఎదురుగుండా ఉన్న పుస్తకం క్రింద పెట్టి బయటకి వచ్చి మెట్ల మీద కూర్చొని ఎదురుగుండా క్రికెట్ ఆడుతున్న పిల్లల వైపే చూస్తున్నాడు.

***

"అన్నా.. నీ కోసం పోస్ట్‌మాన్ వచ్చాడు" కిందింటి కుర్రాడి అరుపుకి ఈ లోకంలోకి వచ్చాడు సూర్యం. గబగబా కిందికి దిగి పోస్ట్‌మాన్ ఇచ్చిన డబ్బు తీసుకుని సంతకం చేశాడు. ఇది అతని తండ్రి దగ్గరి నుండీ వచ్చిన మనిఆర్డర్. దానితో పాటే చిన్న లెటర్.

"సూర్యం! నీ ఉద్యోగ ప్రయత్నాలు ఎంతవరకూ వచ్చాయి? అనుకోకుండా మొన్న మీ అత్తయ్య వాళ్లు వచ్చారు. అందుకే ఈసారి నీకు అయిదు వందలే పంపిస్తున్నాను. త్వరలోనే మరి కొంత సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తాను.

- మీ నాన్న పరమేశ్వరరావు."

కాగితాన్ని పక్కన బెట్టిన సూర్యానికి ఒక్కసారి మైండంతా శూన్యంలా అనిపించింది.

రూమ్‌మేట్ కూడా వెళ్లిపోవటంతో రూమ్ రెంటు, ఇతర ఖర్చులు అన్నీ తానే భరించాలి.

ఇవి చాలక ఈ నెల నాన్న నుండీ కూడా తక్కువే వచ్చింది. ఏమిటీ పరిస్థితి? ఎలా మానేజ్ చేయాలి.

ఎందుకో ఒంటరి తనం ఈ మధ్య తనని మరింత కృంగదీస్తోంది. రమ్య గుర్తొచ్చింది.

తనకి ఈ రోజు ఇంటర్వ్యూ ఉన్నట్లు ఉంది. తనని ఎందుకులే డిస్టర్బ్ చేయడం అనుకొన్నాడు.

కాసేపు ఫ్రెండ్స్ రూమ్‌కెళ్దాం అనుకున్నాడు. గబగబా చెప్పులేసుకుని భాస్కర్ రూమ్‌కేసి నడిచాడు.

భాస్కర్ రూమ్‌లో ఏదో పండుగ వాతావరణంలా కోలాహలంగా ఉంది. కారణం ఆ రోజు భాస్కర్‌కి ఉద్యోగం వచ్చింది. అదీ డిఫెన్స్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఆ మధ్య అందరూ డిఫెన్స్ పరీక్ష రాసినప్పుడు తనతో సహా తమ స్నేహితులు ఓ నలుగురైదుగురు డెహ్రాడూన్‌లో తరువాత పరీక్షకి సెలెక్ట్ అయ్యారు.

కానీ తన దురదృష్టం కొద్దీ మరేదో కంపెనీ ఇంటర్వ్యూ రావడంతో తను వెళ్లలేదు. ఆ రోజు వెళ్లిన నలుగురిలో ఇద్దరు సెలక్టయ్యారు. కాసేపు అక్కడ గడిపినా, తన దురదృష్టమే తనను ఎక్కువగా వెక్కిరిస్తున్నట్లనిపించి. అక్కడి నుండి టాంక్‌బండ్ వైపు పోయే బస్సెక్కేశాడు.

★★★

బుద్ధుని ప్రశాంత వదనం నెమ్మదిగా కదులుతున్న నీటి అలలు కొద్దిసేపు సూర్యానికి ప్రశాంతతని కలుగజేశాయి. ఒక్కసారి తను ఎక్కడి నుండీ ఎక్కడికి వచ్చాడో గుర్తొచ్చింది.

గుడివాడ దగ్గర ఓ చిన్న పల్లెటూరు. పచ్చని పంట పొలాలు, కల్లాకపటమెరుగని మనుషులు, ఒక్క కుటుంబంలా కలిసుండే ఊరు. అలాంటి ఊళ్లో ఆడుతూ పాడుతూ సాగిందతని బాల్యం. తాతల కాలం నుండి వ్యవసాయాధారిత కుటుంబం తనది.

ఇద్దరు అక్కల తర్వాత తను. తన తర్వాత ఓ చెల్లెలు. తన కుటుంబంలో ఎవ్వరూ పెద్దగా చదువుకోలేదు. చిన్నప్పటి నుండి కాస్తో కూస్తో చదువు అబ్బింది తనకే. కానీ చిన్నప్పటి ఓ సంఘటనే సూర్యాన్ని ఇంతవరకూ తీసుకొచ్చింది.

సూర్యం హైస్కూలు చదివే రోజుల్లో కొత్తగా అతని క్లాస్‌లో జాయినయ్యాడు ప్రదీప్. ప్రదీప్ తండ్రి స్టేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా చేసేవారు. ఆ సంవత్సరమే వాళ్లకి ఆ ఊరు ట్రాన్స్‌ఫరయ్యింది. ప్రదీప్ వాళ్లకు ఒక్కగానొక్క అబ్బాయి.

బాగా గారాబంగా చూసేవారు. స్కూలు యూనిఫారం కాకుండా మామూలు బట్టలు వేసుకొచ్చే రోజుల్లో చాలా ఖరీదైన బట్టలు వేసుకొచ్చేవాడు ప్రదీప్.


అతని లంచ్ బాక్స్‌లో కూడా మంచి మంచి రకాలు పెట్టేవారు. ప్రతీరోజూ పనివాడు వచ్చి స్కూల్ దగ్గర దిగబెట్టేవాడు. ప్రదీప్ ఏదడిగితే అది కొనిచ్చేవారు. వాళ్లింట్లో ఓ సారి ప్రదీప్ బర్త్‌డే పార్టీ అని తన క్లాస్‌మేట్స్ అందరినీ వాళ్లింటికి పిలిచారు. వాళ్లింటి నిండా ఖరీదైన వస్తువులు. ఇంటిని అలంకరించారు రంగురంగుల కాగితాలు, బెలూన్స్, అందమైన బొమ్మలు ఇలా. ఆ రోజు ప్రదీప్ సూట్‌లో ఉన్నాడు. చిన్న పిల్లలు కూడా సూట్ వేసుకోవచ్చునేది ఆ రోజే సూర్యానికి తెలిసింది.

ఆ రోజు కేవలం చిన్న పిల్లలే కాక ప్రదీప్ తండ్రి కొలీగ్స్, తల్లి స్నేహితులు, ఇంకా కొంతమంది చుట్టాలు, అదంతా బర్త్‌డే పార్టీ అంటే ఎవ్వరూ అంత త్వరగా నమ్మరు.

ఆ రోజు ప్రదీప్‌కి లెక్కలేనన్ని బహుమతులు క్రికెట్ కిట్, టెడ్డీస్, బొమ్మలు ఇలా ఎన్నో. ఆ రోజు వచ్చిన అందరి పిల్లలకి ఏదో ఒక బొమ్మని 'రిటర్న్ గిఫ్ట్'గా కూడా ఇచ్చారు.


అలా పార్టీకి వచ్చిన వారికి కూడా గిఫ్ట్ ఇస్తారని అప్పుడే సూర్యానికి తెలిసింది. ఒక్కసారి ఏదో వెలితిగా కూడా అనిపించింది ఆ పసిమనసుకి. తన పుట్టినరోజు ఎలా జరుగుతుందో గుర్తుకొచ్చింది. తన పుట్టినరోజు మామూలు రోజులాగానే గడుస్తుంది. ఒక్కోసారి కొత్త బట్టలుంటాయి, లేకపోతే అవీ ఉండవు. అమ్మ మాత్రం పాయసం లాంటిదేదో ఒకటి చేస్తుంది. కొన్నిసార్లు వీలైతే గుడికి తీసుకెళ్తారు. దాదాపు ఏడుపొచ్చింది చిన్నారి సూర్యానికి.

తండ్రి కూడా కొన్నిసార్లు కనబడేవాడు, కొన్నిసార్లు కనబడేవాడు కాదు. సూర్యం తండ్రి వ్యవసాయ పనుల మీద తిరుగుతుండటం, మారుతున్న కాలమాన పరిస్థితుల ప్రకారం ఉండకపోవడం, ఎప్పటిదో తాతలనాటి ఇల్లు, అవే



## నేనింకా టీనేజ్ అమ్మాయినే...?

'అప్పారావు ఫార్టీ ప్లస్' సినిమాలో మందిరా బేదీ నటించడం లేదుట. ఆమె స్థానంలో సిమ్రాన్ నటిస్తుందని వార్తలొచ్చాయిప్పుడు. ఇందుకు కారణం ఓ మిడిలేజ్డ్ నటుడికి జంటగా నటించడం వల్ల తన ఇమేజ్ దెబ్బ తింటుందని ఆమె భావించడమేనట. పాపం మందిర తనను తాను టీనేజ్ అమ్మాయిగా ఊహించేసుకుంటోందివమరి. దాదాపు పదహారు సంవత్సరాల క్రితం 'శాంతి' తొలి డైలీ టీవీ సీరియల్లో హీరోయిన్‌గా నటించిన మందిరకు ఇప్పుడు వయస్సెంత వుంటుందో ఊహించుకోండి...



పద్ధతులు వెరశి చిన్నప్పటి నుండే సూర్యానికి ఒక బలమైన వ్యతిరేకత ఏర్పడటానికి కారణమయ్యాయి.

ఎప్పుడెప్పుడు పట్నం పోదామా అనిపించేది. వయసుతో పాటు ఆలోచనలు పెరిగి ప్రదీప్ తండ్రి ఉద్యోగస్తుడు, తన తండ్రి వ్యవసాయదారుడు అనే భావం బలంగా నాటుకుపోయింది.

బహుశా ఆ భావంలోనే చదువుపై శ్రద్ధ పెట్టి ఎం.సి.ఏ. దాకా చదవగలిగాడు. ఇప్పుడు ఎలాగైనా ఉద్యోగం సంపాదించి విలాసవంతమైన జీవితం గడపడమే తన ధ్యేయంగా పెట్టుకొన్నాడు.

***

"రాత్ బహుత్ హోగయా... అబ్ ఛలో భాయ్ అన్న పోలీస్ హెచ్చరికతో ఈ లోకంలోకి వచ్చాడు సూర్యం. త్వరలో రూమ్ మారాలి. లేకపోతే ఇక్కడ బతకటం కష్టం అనుకుంటూ రూమ్‌లోకి అడుగుపెట్టాడు.

సూర్యం అద్భుతమైన తెలివితేటలు కలవాడు కాదుగానీ పుస్తకాలలో ఉన్నది చదివి అర్థం చేసుకోగలిగినవాడు. అందుకే చదవగలిగాడు. కానీ నలుగురిలో కలవడం, సమాజాన్ని అర్థం చేసుకొని మసలుకొనే బతకనేర్చిన తెలివితేటలు మాత్రం లేవు. అందుకే చదువు పూర్తయి రెండేళ్లు దాటుతున్నా కనీసం ఏదో ఒక ఉద్యోగం సంపాదించలేకపోయాడు.

స్నేహితుల సలహా మీద టీచింగ్ ప్రొఫెషన్‌లోకైనా మారదామనుకొంటే స్టేజ్ ఎక్కితే గొంతు తడారిపోతుంది. కింద పది మందిని చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి.

ఇలాంటి పరిస్థితులలో అది తన వల్ల కాదని తెలిసిపోయింది. పోనీ ఏ బ్యాంక్ టెస్టో, లేక ఏ గ్రూప్ సర్వీసు పరీక్షలో రాద్దామంటే హెవీ కాంపిటీషను. అసలు తన కంప్యూటర్ రంగం దాటి వేరే రంగాల వైపు వెళ్లడానికి, కళ్లముందు కనబడుతున్న విలాసవంతమైన జీవితం, తన ముందే కంప్యూటర్ రంగంలోకి వెళ్లి ఆనందంగా జీవితాన్ని అనుభవిస్తున్న స్నేహితులు ఇవన్నీ చూస్తూ చూస్తూ అతనికి ఆశ చావక ఎలాగోలా ఈ రంగంలోనే నిలదొక్కుకోవాలని తాపత్రయం.

***

తాతల కాలం నాటి పొలం. తన తండ్రికొచ్చిన వాటాలో తన ఇద్దరక్కల పెళ్లిళ్లకి అమ్మగా పోనూ ఓ పదెకరాల దాకా మిగిలింది. వయసు మీద పడటం, అనారోగ్య సమస్యలు, పిల్లల చదువుల నిమిత్తం పల్లెటూరుని వదిలి పక్కనే ఉన్న టౌనుకి రావడం, రోజూ పొలం పనుల నిమిత్తం టౌనుకి, పల్లెకి తిరగలేక పొలాన్ని కౌలుకివ్వడంతో పరమేశ్వరరావు కష్టాలు మరిన్ని పెరిగాయి. ప్రకృతి వైపరీత్యాలు, కౌలుదారుల కాకిలెక్కలు పోనూ ఆయన చేతికి వచ్చేది సంవత్సరం, సంవత్సరానికి తక్కువవ్వడం, పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో పరిస్థితి రోజురోజుకి దిగజారుతోంది.

***

నెల తర్వాత బిర్లామందిర్ మెట్ల మీద సూర్యం, రమ్య. రమ్యకి ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ వచ్చింది. వాళ్లింట్లో ఉత్సవ వాతావరణం. దానితో పాటే రమ్య 'పెళ్లి సందడి' కూడా మొదలైంది. అప్పటికే రమ్యకి మంచి ప్రపోజల్స్ ఉన్నాయి. ఉద్యోగంలో కూడా చేరడంతో పెళ్లి సంబంధాల తాకిడి ఎక్కువగా ఉంది.


జాబ్ వచ్చాక పర్సనల్‌గా సూర్యాన్ని కలిసి చెప్పాలనుకొంది కానీ, జాబ్ వచ్చిన వెంటనే మెడికల్ టెస్టులని, ఫార్మాలిటీస్ అని, ఇండక్షన్ ప్రోగ్రాం, ట్రెనింగ్ ఇలా ఆఫీసు పనులతోను, గుళ్లలో పూజలు, మొక్కులు ఇలా ఇంట్లో పనులు, మధ్య మధ్యలో పెళ్లి సంబంధాల వాళ్లు, చుట్టాల రాకపోకలు... ఇదిగో అదిగో అంటూనే నెల గడిచిపోయింది.

ఇప్పటి వరకూ ఫోన్‌లోనే మాట్లాడుకొన్నారు వాళ్లిద్దరూ. ఇప్పటికి గానీ తీరిక కాలేదు రమ్యకి.

"నాకు జాబ్ వచ్చినందుకు నువ్వు హ్యాపీగా లేవా సూర్యం?" మౌనాన్ని ఛేదిస్తూ అడిగింది రమ్య.

"ఛఛ... అదేం లేదు. ఐయామ్ వెరీ హ్యాపీ ఫర్ యూ" అతని మనసులో ఏముందో అర్థం చేసుకోలేనంత అమాయకురాలు కాదు తను.

"ఈ ఉద్యోగం నాకన్నా నీకొస్తేనే నేను ఎక్కువగా సంతోషించేదాన్ని." ఆత్మాభిమానం ఉన్న ఏ వ్యక్తయినా, ఎవ్వరైనా తన మీద జాలి చూపిస్తే భరించలేడు. అక్కడా జరిగిందదే. కానీ ఈ సమయంలో తను ఏమన్నా అది తనని తాను మరింత చిన్నబుచ్చుకోవడమే అవుతుందనిపించింది అతనికి. అదే మరెవరైనా అయితే ఈపాటికి ఆ ప్రదేశం నుండీ ఎప్పుడో వెళ్లిపోయే వాడు. కానీ అక్కడుంది తాను ప్రేమించిన మనిషి తను జీవితం పంచుకోవాలను



## గాలి దుమారం

అమెరికాలోని విస్కాన్సిన్‌లో గ్రాండ్‌వ్యూ ఇండస్ట్రియల్ పార్కు దగ్గర ఉధృతమైన గాలి వీచినప్పుడు ఓ ట్రక్కు ట్రయిలర్ తలక్రిందులైనంత పనయి రెండు కార్లమీదకి ఒదిగిపోయింది!

## బేటరీ కారు

జపాన్‌లో వశీదా యూనివర్సిటీ విద్యార్థులు హైబ్రిడ్ బేటరీలతో నడిచే లైట్ వెయిట్ కారుని ఇటీవల తయారుచేశారు. రెండు మీటర్ల పొడుగుండే ఈ కారు గంటకి 50 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. అయితే దీంట్లో ఒక్కడే ప్రయాణం చేయగలడు. దీన్ని వచ్చే యేడు ఫాక్టరీ లెవెల్ ప్రొడక్షను చేస్తారుట!

-తటవర్తి



కొన్న వ్యక్తి. అందుకే ఏమనాలో, ఏం చేయాలో తెలియక మౌనాన్నే ఆశ్రయించాడు.

కొద్ది క్షణాల తర్వాత తనే మౌనాన్ని భంగపరుస్తూ అన్నాడు "బాగా చీకటి పడింది. చలి కూడా బాగా ఉంది. వెళ్దామా?"

తాము ఎప్పుడు కలిసినా, ఇక ఇంటికెళ్లే ప్రసక్తి ఎప్పుడూ తనే తెస్తుంది. అలాంటిది మొట్టమొదటిసారిగా ఈ రోజు అతనన్నాడు. తను చెప్పాలనుకొన్న విషయాన్ని చెప్పాలా, వద్దా అని కాసేపు తటపటాయించింది. కానీ చెప్పక తప్పదని ఇక తనే అంది.

"సూర్యం....నీతో ఓ విషయం చెప్పాలి."

ఏంటన్నట్లుగా చూశాడు. అతడి మొహంలో భావాలు సంధ్య చీకట్లో తనకి స్పష్టంగా కనబడటం లేదు. కొంచెం సేపు మానసిక ఘర్షణ అనంతరం గొంతు పెగుల్చుకొని అంది.

"మా ఇంట్లో మన గురించి చెప్పాను" అతని నుంచీ ఏ సమాధానం రాలేదు. తన భావాలను వెంటనే, బయటకి చెప్పడం అలవాటు లేదతనికి. అతనిని అర్థం చేసుకోడం కష్టం. ఇన్నాళ్లు పరిచయం తర్వాత కూడా అతనిప్పుడు తనకి పరాయివాడిలాగానే కనపడుతున్నాడు.

తను చెప్పాలనుకొన్న విషయాన్ని చెప్పసాగింది రమ్య.

"నీకు తెలుసు కదా సూర్యం! చదువు అయినప్పటి నుంచే పెళ్లిగోల మొదలైంది. ఎలాగోలా ఈ రెండు సంవత్సరాలు నెట్టుకొచ్చా. ఇక ఉద్యోగం కూడా రావడంతో ఇంట్లో వత్తిడి ఎక్కువైంది. దాంతో చెప్పక తప్పలేదు" కాసేపు మౌనం.

ఆమె ఇంట్లో ఎలాంటి సమాధానం వచ్చి ఉంటుందో ఊహించగలిగినా, అడుగక పోతే బాగుండదని అడిగాడు. "ఏమన్నారు?" అని ముక్తసరిగా.

"నీ గురించీ, మీ ఫ్యామిలీ గురించి అడిగారు. వాళ్లకేమీ అభ్యంతరం లేదు గానీ నువ్వింకా సెటిలవ్వలేదు కదా! అని అన్నాను" ఒక్క క్షణం ఆగింది. అతడి మనసులో ఏముంటుందో ఆలోచిస్తూనే, "నువ్వు సెటిల్ అయ్యేదాకా ఆగుతానని చెప్పా" అతనికి కాస్త సపోర్టింగ్‌గా మాట్లాడాలని అంది.

"దానికి వాళ్లు ఒప్పుకొన్నారా?" అతని మాటలలో నైరాశ్యాన్ని ఆమె గ్రహించింది.

"అంటే... ముందు ఒప్పుకోలేదనుకో కానీ వెయిట్ చేయడానికైనా కొంత లిమిట్ ఉంటుంది కదా! అన్నారు".

అవి ఆమె పేరెంట్స్ మాటలా, తన మనసులోని మాట కూడానా? అని మొదటిసారి అతనికి ఆమె ప్రేమపై అపనమ్మకం కలిగింది.

"అందుకే... ఓ ఆరు నెలలు గడువిచ్చారు. ఈలోపు నువ్వు సెటిల్ అయితే మన మ్యారేజి చేస్తామన్నారు" కాస్త హుషారుగా చెప్పబోయింది.

ఒక పెద్ద కొండను తీసుకొచ్చి నెత్తిమీద పెట్టినట్లనిపించింది. ఆ బరువుని తప్పించుకోలేక దాని కింద పడి తను నలిగిపోవడం ఎంత ఖాయమో, ఈ ప్రేమ దెబ్బకి తను విలవిలలాడటం అంతే ఖాయమని తేలిపోయింది. రెండేళ్లుగా రాని ఉద్యోగం ఈ ఆరు నెలల్లో వస్తుందన్న నమ్మకం లేదు. కానీ 'ప్రేమకి లిమిట్' ఈ కొత్త 'కాంసెప్ట్' తనని అగాథంలోకి తోసేస్తుంది. పెద్దలుగా వారికి తెలియకపోవచ్చు. కానీ ప్రేమించిన అమ్మాయికి తెలియదా? అతని మెదడు అవునని చెప్తున్నా, 'పాడు మనసు'కి ఎందుకో, ఏ మూలో ఆశ. అందుకే అడిగాడు.

"మరి నువ్వేం అనుకొంటున్నావు?"

"వాళ్లు చెప్పింది కూడా కరెక్టేకదా!" కొంచెం నెమ్మదిగానే అంది.

అంతే... ఒక పెద్ద లోయలోకి అతనిని ఎవరో బలంగా నెట్టేసినట్లయింది.

అతడేమనుకొంటాడో అని "అయినా ఆరు నెలలంటే చాలా టైం ఉంది. ఈ లోపున నీకు ఉద్యోగం వచ్చేస్తుందని నాకు నమ్మకముంది" లేని భరోసా ఇస్తున్నట్లనిపించింది అతడికి.

ఇక వాళ్లిద్దరి మధ్య ఏ మాటలూ జరగలేదు.

"ఇక వెళ్దామా?" తనే అడిగింది.

ఇద్దరి మధ్య విడదీయలేనంత పెద్ద గొయ్యి ఏర్పడినట్టుంది. ఏ రోజైనా రమ్య నుండీ ఇలాంటి మాటలు వినాల్సొస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఇద్దరూ లేచి కిందకొచ్చారు.

రమ్య ఆటో ఎక్కి వెళ్లిపోతుంటే, తన దగ్గరి నుండీ శాశ్వతంగా పోతున్నట్లనిపించింది సూర్యానికి.

***

రాత్రి రెండవుతోంది. నగరం అంతా నిద్రలోకి జారుకొంటోంది. ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు సూర్యానికి. మనసంతా శూన్యంగా ఉంది. అయిపోయింది. అంతా అయిపోయినట్లుంది.


కన్నవాళ్లకు చేదోడు, వాదోడుగా ఉండాల్సిన వయసులో ఇంకా తను



## ఎయిర్ షో

ఆమధ్య ప్యారిస్‌లోని లెబోర్నెట్ ఎయిర్‌ఫీల్డులో 'ఎయిర్‌షో' జరిగింది. ప్రపంచంలో అతి పెద్దదయిన ఈ షోలో అనేక దేశాల ప్రముఖ కంపెనీలు తమ విమానాలని ప్రదర్శించారు. గ్లోబల్ ఎయిర్ ట్రాఫిక్ నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఈ షోవల్ల బిలియన్ల డాలర్ల బిజినెస్ పెరగనుంది.

-తటవర్తి



వారికి భారంగానే ఉన్నాడు. స్నేహితులు తనతో కలిసుండేది తాత్కాలికమేనని అర్థమయ్యింది. అన్నిటికంటే ముఖ్యంగా తన ప్రేయసి, తన జీవితం అను కొన్న రమ్య వెళ్లిపోయింది.

నిజానికి రమ్య ఆశాభావంతోనే మాట్లాడినా, ఆమె కూడా ప్రేమకి 'లిమిట్' ఉంటుందని చెప్పడం ద్వారా తన అభిప్రాయాన్ని చెప్పకనే చెప్పింది. ఇప్పుడు ఆతనికి ఉద్యోగం, వచ్చినా రాకపోయినా తను రమ్యని గతంలోలాగా ప్రేమించలేడు. అతను కోరుకున్నదీ కష్టసుఖాల్లో ఎప్పుడూ తోడుండే ఒక సహచరిణి కానీ తను ప్రేమను కూడా జీవితంలో ఒక భాగంలాగా మాత్రమే పరిగణించే స్థాయికి వెళ్లిపోయింది.

ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే ఆమె కరెక్టే. ఇక తన పరంగా చూస్తే ఇది తన దుర దృష్టం. తను ఓ చేతకాని వాడు. తనకు ఈ సమాజం నుండీ ఏమీ లభించ లేదు. తను ఈ సమాజానికి ఏమీ చేయలేకపోయాడు. తన వల్ల ఎవరికీ ఉప యోగం లేదు. అంతేకాదు, తను తన కన్నవారికే కాక ప్రేమించిన అమ్మాయికి కూడా భారం.

అవును తను లేకపోతే తన తండ్రికి కాస్త ఖర్చు తగ్గుతుంది. తను లేకపోతే రమ్య కూడా జీవితంలో బాగా స్థిరపడిన ఒక మంచి వ్యక్తిని చేసుకొని హాయిగా ఉంటుంది. అవును, తను చాలామందికి అడ్డం. ఇక బతికి ఏ ప్రయో జనం లేనప్పుడు చావే శరణ్యం.

ఒకసారి ఒళ్లు జలదరించింది సూర్యానికి. 'చావు' అంతకు ముందు వరకూ ఆ మాటలంటేనే భయం. కానీ ఇప్పుడు తనే దానిని ఆహ్వానించబోతు న్నాడు.

చాలా రోజుల తర్వాత అతని దుఃఖం కట్టలు తెంచుకొంది. కళ్లు జలపాతా లయ్యాయి.

ఎంతసేపు ఏడ్చాడో అతనికీ తెలీదు. చాలాసేపటికి ఇక నీళ్లు రావడం కూడా ఆగిపోయాయి.

★★★

తెల్లవారింది. ఎవరి పరుగులో వారున్నారు. ఎవరి జీవన సమరం వారిది. ఉదయం పదవుతోంది. కిందింట్లో ఉండే పిల్లలు స్కూళ్లకు, పెద్దవాళ్లు వాళ్ల వాళ్ల పనులకు వెళ్లిపోయారు. పై నుండీ సూర్యం మాత్రం కిందకి రాలేదు. కిందింటామె అనుకున్నా, మళ్లీ 'ఏమోలే' అనుకొని తన పనిలో తాను మునిగి పోయింది.

సాయంత్రం వరకు పై నుండీ చడీ చప్పుడు లేదు. పిల్లలు స్కూళ్ల నుండీ వచ్చారు. కిందింటామెకు ఎందుకో అనుమానం వచ్చింది. ఎందుకైనా మంచి దని కొడుకుని పైకెళ్లి చూసి రమ్మని పంపింది.

నాలుగోతరగతి చదివే బాబిగాడు తలుపులు కొడుతూ, 'అంకుల్, అంకుల్' అంటూ కాసేపు గోల చేయడంతో నెమ్మదిగా తలుపులు తెరుచుకొ న్నాయి. ఒక్కసారి సూర్యాన్ని, ఎగాదిగా చూసి తుర్రుమన్నాడు బాబిగాడు. కాస్సేపట్లో బాబిగాడి అమ్మ కూడా మేడమీదకు వచ్చింది. మాసినగడ్డం, చింపిరిజుట్టు, బాగా నలిగిన బట్టలు సూర్యం వాలకం ఏమీ బాగా లేదు.

"ఏంటి బాబు అలా ఉన్నావు. పొద్దున్నుండీ తలుపు తీయలేదు. ఒంట్లో బాగాలేదా?'' ఆమె గొంతులో ఆందోళనని గమనించాడు సూర్యం. అవును. అమ్మ మనసు అమ్మ మనసే. ఏ తల్లి బిడ్డనైనా తన బిడ్డలాగానే చూడగల అరు దైన మనసు.

"అబ్బే, అదేం లేదండి. కొంచెం తలనెప్పిగా ఉంది. అంతే,'' ఏదో కవర్ చేయాలని చూశాడు. ఓసారి అనుమానంగా చూసి, ఏమైనా కావాలంటే అడ గమని బాబిగాడిని తీసుకొని కిందికి వెళ్లిపోయిందామె.

ఒకసారి అద్దంలో తన వాలకం చూసుకొని విరక్తిగా నవ్వుకొన్నాడు. నిజా నికి నిన్న రాత్రి చచ్చిపోదామనుకున్నాడు.

కానీ, భయం. నిజానికి, చావటానికి కూడా చాలా ధైర్యం కావాలి. తనకి అంత ధైర్యం లేదని అప్పుడే తెలిసింది. కొంత ధైర్యం తెచ్చుకున్నాక ట్రై చేద్దాం అనుకొన్నాడు.

కిందింటి ఆమెను చూశాక ఆమె ఆదుర్దాని గమనించాక, సూర్యానికి తల్లి గుర్తుకొచ్చింది.

తన తల్లీ అంతే ఆ మాటకొస్తే ఏ తల్లి అయినా అంతే.

చచ్చే ముందు ఒకసారి కన్నతల్లిని చూడాలని అనిపించింది మనసుకి. ఆరోజే తన దగ్గర మిగిలిన డబ్బుల్ని ఇంటి ఓనర్ దగ్గర ఇచ్చేసి రూమ్‌లో ఉండే కొద్ది సామాన్లని వాళ్లకే వదిలేసి తన ఊరు వెళ్లే రైలు ఎక్కాడు.


★★★

"ఏంట్రా నాయనా, ఇలా అయిపోయావు. ఫోన్‌లో బానే ఉన్నాను అని చెబితే నిజమే అనుకొన్నాను'' దుఃఖం పొంగుకొచ్చింది పార్వతమ్మకి. పరమే



## ఆల్ ది బెస్ట్!

ఖడ్గం చిత్రంలో నటించిన కిమ్‌శర్మ ఇకపై తన దృష్టంతా సినిమా కెరీర్ పైనే పెట్టదల్చుకున్నట్టు వెల్లడించింది. క్రికెటర్ యువరాజ్ సింగ్‌తో చెట్టాప ట్టాలేసుకుంటూ ఇంత కాలమూ తిరిగిన కిమ్‌శర్మ ఇక ఆ ప్రేమాయణానికి ఫుల్‌స్టాప్ పెట్టేసినట్టేనట. అనవసరంగా తను వేరే వ్యాపకాల్లో (ప్రేమాయ ణమే కావచ్చు) పడి తన సినీకెరీర్‌ని నిర్లక్ష్యం చేసానని వాపోతున్న కిమ్‌శర్మ ఇక కాలాన్ని వృథా చేయకుండా సినిమాలపైనే దృష్టి పెడతానంటోంది. మంచిదే! ఆల్ ది బెస్ట్ కిమ్‌శర్మా!



శ్వరరావుకి మాత్రం అయోమయంగా ఉంది. రేపోమాపో ఉద్యోగం సంపాదించి వస్తాడనుకొన్న వాడు ముఖం వేలాడేసుకొని, ఈ అవతారంలో రావడం ఆయనకు మింగుడు పడటం లేదు. అంతకు ముందు రోజే చీకట్లో సరిగా చూసుకోక పొలం గట్టు మీద నుండీ కాలు స్లిప్ అయ్యి బెణకటంతో ఆయన మంచంలోనే ఉన్నారు. చెల్లెలు స్కూలుకెళ్లింది.

"ఈ మధ్య మీ నాన్నకి ఒంట్లో ఏం బాగుండటంలేదు. షుగర్, బీపీ రెండూ వచ్చాయి.

దీనికితోడు కాలు బెణకడంతో ఇప్పుడు ఇలా ఉన్నాడు. మన అదృష్టం కొద్దీ విరగలేదు కానీ, లేకపోతే ఈ వయసులో అతుక్కోవటం కష్టం" పక్కకు తీసుకెళ్లి అన్నాడు గోవిందరావు.

"ఇవన్నీ నాకు చెప్పలేదే?" ఆశ్చర్యపోతూ అడిగాడు సూర్యం.

"సర్లే... నీకు తెలియనివి చాలా ఉన్నాయి. మీ అక్కల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీర్చలేక మొనన్నే ఐదు ఎకరాలు అమ్మేశాడు మీ నాన్న. ఆయనొక్కడే తిరిగి ఈ పొలం పన్లు అన్నీ చూసుకోలేకపోతుండటంతో మిగతా పొలాన్ని కౌలుకు ఇవ్వాల్సివచ్చింది."

"ఏంటి, పొలాన్ని కౌలుకిచ్చారా?" మరింత ఆశ్చర్యపోతూ అడిగాడు సూర్యం.

"మీ చిన్నతనం నుండీ కూడా కొంత పొలాన్ని కౌలుకిస్తూనే ఉండేవాడు. ఇక మీ చదువులు, పెళ్లిళ్లు ఇలా అన్నీ పోయి ఇప్పుడు ఆరోగ్యం పోయాక, మొత్తం కౌలుకిచ్చాడు. ఆ కౌలుకి తీసుకొన్నవాడు మీ నాన్న సరిగా పట్టించుకునే స్థితిలో లేడని చూసి వర్షాలు పడటం లేదని, నీళ్లు లేవని, నకిలీ విత్తనాలని ఏదో ఒక వంక చెప్పి ఎప్పుడూ ఇవ్వాల్సినంత ఇవ్వటం లేదు. మొన్ననే నేనూ మా చంద్రం బాబాయ్, మన రామానుజంగారూ అందరం వెళ్లి వాడిని గట్టిగా కేకలేశాము. దాని తర్వాతే మీ నాన్న ఆ ఐదెకరాలు అమ్మగలిగాడు. లేదంటే వాటిని అమ్మనీకుండా వచ్చిన వాళ్లందరికీ ఏదో ఒక కారణం చెప్తూ బేరాలన్నీ చెడగొడుతున్నాడు. చివరికి కొంచెం తక్కువకే అమ్మాల్సి వచ్చింది. అసలే ఇప్పుడు రేట్లు పడిపోయాయి కూడా.." చెప్పుకుపోతున్నాడు గోవిందరావు.

"కొంత కాలం ఆగి ఉండాల్సింది కదా.. మామయ్యా. కాస్త మంచి రేటు వచ్చేదేమో!" తన సందేహాన్ని వ్యక్తపరిచాడు.

"కానీ, అప్పటిదాకా అప్పులవాళ్లు ఆగరుకదరా!" ఉన్న మాట చెప్పాడు గోవిందరావు.

ఆ రాత్రంతా బాగా ఆలోచించాడు సూర్యం.

***

వారం రోజుల తర్వాత.... "పొలం వెళ్లొస్తానే పార్వతీ! చాలా రోజులైంది కదా.." అంటూ చెప్పులేసుకోబోయాడు పరమేశ్వరరావు.

"ఆగండి నాన్నా! ఈ రోజు నుండీ మీరు పొలం వెళ్లక్కరలేదు. ఇక నుండీ నేనే ఇవన్నీ చూసుకుంటాను. చెల్లాయి చదువు, పెళ్లి ఇవన్నీ కూడా ఇక మీరు నాకు వదిలేయండి. మీరు జాగ్రత్తగా మీ ఆరోగ్యం చూసుకుంటూ పెద్ద దిక్కుగా ఉండండి చాలు" అనేసి బయటికి వెళ్లాడు సూర్యం.

అప్పుడే లోపలికి వస్తున్న గోవిందరావుతో "ఏంటి బావా ఇది?" అన్నాడు నమ్మశక్యం కానట్టు పరమేశ్వరరావు.


"నన్ను క్షమించు బావా! మొన్న సూర్యానికి ఉన్న విషయం చెప్పాను. ఆ తర్వాత వాడే వచ్చి నాకు నీ సహాయం కావాలి మామయ్యా అని అడిగాడు. తర్వాత మేము వెళ్లి మన కౌలుదారు రంగయ్యతో మాట్లాడాం. మన రామానుజంగారిని, లింగరాజుగారిని కూడా తీసుకువెళ్లాము. మొదట కాస్త మెలికెయ్యాలని చూశాడు గానీ చివరకి ఇవ్వక తప్పలేదు వాడికి. ఇక మన పొలం మన సూర్యమే చూసుకుంటాడు. వాడికి నేను, చంద్రం మన వాళ్లంతా అండగా ఉంటాం. ఈ రెండూ, మూడు రోజులుగా మేము అదే పనిలో ఉన్నాం. నీకు చెప్పాలని అనుకున్నా, నిన్ను ఇక విశ్రాంతి తీసుకోనివ్వాలని వాడే చెప్పొద్దన్నాడు. ఇంకేం ఫర్లేదు బావా! నీకు మంచి రోజులు వచ్చినట్లే" అని సూర్యం వెళ్లిన వైపు చూడసాగాడు గోవిందరావు.

తను విన్నది తనే నమ్మలేనట్లున్న పరమేశ్వరరావు తను విన్నది నిజమా అని నిర్ధారించుకోవాలన్నట్లు తనూ సూర్యం వెళ్లిన వైపు చూశాడు.

రోడ్డు మీద ఉత్సాహంగా సైకిల్ తొక్కుతూ వెళ్తున్న సూర్యం కనబడ్డాడు తూర్పు తెల్లారుతోంది. సూర్యుడు ఉత్సాహంగా ఉదయిస్తున్నాడు. ఉత్సాహంతో ఉరకలేస్తూ ఉదయిస్తున్న సూర్యుణ్ని చూస్తూ "సూర్యుడు ఉదయించాడు బావా!" అన్నాడు గోవిందరావు.

"నిజంగానే సూర్యుడు ఉదయించాడు గోవిందం" అన్నాడు పరమేశ్వరరావుగారు ఉదయిస్తున్న సూర్యుడిని, ఉదయించిన సూర్యాన్ని మార్చి మార్చి చూస్తూ.

★



## సూపర్ స్టార్లు ఇక లేనట్లే...

మారిపోయిన పరిస్థితుల దృష్ట్యా భవిష్యత్తులో ఫలానా హీరో సూపర్ స్టార్ అని కాకుండా ఎవరికి వారే సూపర్ స్టార్లుగా చెలామణీ అయ్యే అవకాశముందని సెలవిస్తున్నాడు షారూక్‌ఖాన్. బహుశా బాలీవుడ్‌లో నేనే చివరి సూపర్ స్టార్‌ని కావచ్చునేమో- అంటూ తన గురించి తనే గొప్పలు చెప్పుకుంటున్నాడు. మరి మీరేమంటారు?

